భక్తుల రద్దీ అంతగా లేదుగాని... అటూ ఇటూ ఎక్కే వాళ్లో దిగేవాళ్లో ఎదురౌతూనే వున్నారు. గుడి ఛిద్రం కాకుండానే వుందిగాని చుట్టూ కొన్ని స్తంభాలు, శిలలు పతనమై శిధిలాలలాగా కనిపిస్తున్నాయి. రాణీ అతి వేగంగా అమిత ఉత్సాహంగా శిధిలాలు చుట్టీ తిరిగి వాళ్లు వచ్చిన చోటుకే వెడుతోంది.

"గుడివెనక్కి వెళ్లనీయకండామెని. అటు కాలు జారిందంటే చాలా లోతు, ప్రమాదం." ఓ పెద్దాయన హెచ్చరించాడు.

రాజా నాలుగడుగులు గబగబ వేసి 'రాణీ' అంటూ కేక వేశాడు. కాని రాణీ గుడి వెనుక లేదు. అటు నుండి గుడి వక్కగా వున్న మంటపంకేసి చాలా నెమ్మదిగా నడుస్తోంది. వదులుగా అల్లిన జడ దాదావు విడిపోయింది. కొత్త మెరుపు పులుము కుని రాణీ ముఖం వెల్గుతున్నట్టుగా వుంది.

అలాగే నిలబడి పోయింది రాణీ. ఆమెకి తల తిరిగినట్టుగా వుంది. చెవుల్లో ఏదో సముద్రపుహెూరు. తననెవరో ఆకాశంలో అగాధంలోకి విసిరేస్తున్నారా అన్నంత భయంగా బాధగా వుంది... విప్పారిన కళ్లతో మంటపంలో అడుగు పెట్టింది.

'రా, వచ్చావా. నీ కోసమే చూస్తున్నాను," అన్న గంభీరమైన పిలుపు విని వక్కనే పిడుగు పడ్డట్టు ఉలిక్కి పడి... పరుగు పెట్టింది రాణీ 'రాజా, రాజా' అంటూ అరుస్తూ.

అమాతంగా ఆమెని పొదివి పట్టుకున్నాడు రాజా.. సునంద బిక్క ముఖం వేసుకు చూస్తూంది.

వీస్తున్న గాలికి ధ్వజస్తంభం మీది చిరుగంటలు తెగ మ్రోగుతున్నాయి. 'రారా, గజ్జలేవి?' అంటూ లేచివస్తున్న వ్యక్తి కేసి చూసి భయంతో కెవ్వున అరిచి మైకం పడిపోయింది రాణీ. ఎవరో నలుగు రైదుగురు అతడిని పట్టి వెనక్కి తీసుకు పోయారు.

"అలా వెంట పడి పోకు. అమె వస్తే రాదా?" అంటూ కోప్పడు తున్నారు. "వాడో పిచ్చివాడు సార్, ఎప్పటి కైనా తన శిమ్మెరాలొస్తుందంటాడు... మరేం భయంలేదు వెళ్లి మళ్లీ మండపంలో కూర్చుంటాడు యింక రాడు లెండి." అని ధైర్యం చెప్పారెవరో. "ఎన్నిసార్లు బలవంతాన పంపేసినా ఈ స్థలం వదిలి పోడమ్మా మునలాడు కదా అని ఎవరూ పట్టించు కోరు."

కాని రాణీ బాగా చెలించి పోయిందీ సంఘటనతో.

"రేపు చూద్దాం యిప్పటికి వెళ్లి పోదాం" అంది భయంగా సునంద.

రాణీ చేయి ఆప్యాయంగా అందుకుంటూ "పద రాణీ వెడదాం" అన్నాడు. రాజా బల్లిలా అతన్ని అంటుకుపోయి నడవడం ప్రారంభించింది.

ముగ్గురూ భవంతి చేరేసరికి బాగా చీకటి పడిపోయింది.

కాని లైట్లతో ఇల్లు కళ కళ లాడు తోంది.

[సశేషం]

# చిట్టి కథలు

## చౌక బేరం

మెయిన్ రోడ్డుపై హటాత్తుగా ఆగిపోయింది హరిత. ఫుట్‌పాత్ పైనున్న ప్లాస్టిక్ వస్తువుల పై దృష్టి పడింది. తనకవసరమైన సామాగ్రి కన్పించిందక్కడ.

"పెద్ద షాప్‌లో కెళ్లి బేరం చెయ్యలేము. వాళ్లు చెప్పిందేరేటు. ఫుట్ పాత్ మీదైతేనే చవగ్గా దొరుకుతాయి!"

అనుకుంటూ...

"ఏరా అబ్బీ! ఇదెంత? దీనిరేటెంత?" అడిగింది! చెప్పాడు వాడు.

"అమ్మో చాలా యెక్కువే చెబుతున్నావ్!"

షాప్‌లో క్రితం రోజు తాను విన్నధర కన్నా తక్కువే చెప్పాడు వాడు.

సరిగ్గా సగానికి తగ్గించి మరీ అడిగింది హరిత.

గొణుక్కుంటూ... సణుక్కుంటూ మరి కొంచెం... మరి కొంచెం హెచ్చించి చెబుతూ, చివరికి ఆమె చెప్పిన రేటుకి తగ్గాడు.

"వెధవకి డబ్బవసర మెంతగా వుందో... ఇంత చవగ్గా యిస్తున్నాడు... వాడి అవసరమే తన కవకాశం!"

లోలోన సంతోషపడ్తూనే... మొత్తం కలపగా వచ్చిన పదిన్నర పైక మివ్వబోతూ... "ఆపై అర్ధరూపాయి తీసెయ్! పది తీసుకో!" అంది మళ్లీ.

ససేమిరా అన్నాడు వాడు.

అయితే నాకఖర్లేదంటూ వెనుదిరిగింది.

వెనకనుండి అనుకున్నట్టే పిలుపు విన్పించి వెనక్కు తిరిగింది. "అట్లాగే తీసుకోండి!"

అంటూ తను బేరమాడిన వస్తువుల్ని చేతబట్టుకున్న వాణ్ణి చూస్తూ... గర్వంగా, పదినోటు వాడి చేతిలో పెట్టి, ఆవస్తువుల్ని బుట్టలోవేసుకుంటూ, వాణ్ని కూడా బుట్టలో పెట్టగల్గిన తన చౌక బేరానికి మురిసిపోతూ ముందుక్కదిలింది.

ఇంతలో...

"ఏమండీ!"

అన్న వాడి పిలుపు మళ్లీ విన్పించింది.

యేమిటన్నట్టు చూసింది విసుగ్గా.

"మీరిచ్చిన యీ పదినోట్లో మరో పదినోటున్నదండీ! మడత విప్పి చూడక పొరబడ్డారేమో!"

అంటూ తిరిగి పదినోటు తనకిస్తున్న వాణ్ణి చూస్తూ నోట మాట రాలేదు హరితకు.

ఆశ... దురాశగామారి పావలా... పావలా గంటనుండీ తనాడిన చౌకబేరం. విలువకట్టలేని వాడి నిజాయితీ ముందు వెల వెల బోయినట్ట న్పించిందామెకు.

—కె. వీణారెడ్డి.

## అందం

హౌరా ఎక్స్‌ప్రెస్ ప్యాసింజరులా నడుస్తోంది. నాకు చాలా విసుగ్గా ఉంది. చీరాల చేరటానికి ఇంకా ఒకగంట పట్టేట్టుగా ఉంది. ఒంగోలులో ఎక్కిన నేను కూర్చోటానికి స్థలం లేక ఒక పదినిమిషాలు అలాగే నిలబడ్డాను.

కొంత సేపటికి ఒక ముసలమ్మని బ్రతిలాడి జరిపి కూర్చున్నాను నిలబడలేక. ఎదురు సీట్లో ఇద్దరూ తెలుగు వాళ్లలాగా లేరు. ఆస్త్రీ పురుషులిద్దరూ కంపార్టుమెంటులో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. వాళ్ళ అందం అలాంటిది. ఆమె నవ్వితే సొట్టలు పడేబుగ్గలు ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. అతని వంటి గులాబీ రంగు ఆకర్షణీయంగా. వాళ్ళిద్దరూ హిందీలో మాట్లాడు కుంటున్నారు. మాటల్ని బట్టీ అన్నాచెల్లెళ్ళని అర్థమవుతోంది.

రైలు ఒక్క కుదుపుతో చిన్న గంజాం స్టేషన్‌లో ఆగింది. అతను దిగి ప్లాట్ ఫారం పై పచార్లు చేస్తున్నాడు. మధ్య మధ్య కిటికీ దగ్గరికి వచ్చి ఆమెతో మాట్లాడుతున్నాడు. ఇంతలో ఆమె 'టీ' కావాలంది. అప్పుడే రైలు ఎక్కిన అతడు 'టీ' కుర్రాడిని పిలిచాడు. చెరో కప్పు టీ తీసుకున్నారు. ఆమె టీ కప్పు పెదవుల కానించు కుంది గార్డు విజల్ వేశాడు. ఆమె కంగారు పడింది. కంపార్టుమెంటులో అందరిదృష్టి వాళ్ళమీదే ఉంది.

రైలు కదిలింది.

ఆమె టీ త్వరగా త్రాగలేక పారబోస్తానంది అతను. 'వద్దు ఫర్వాలేదు' అంటున్నాడు. టీ కుర్రాడు రైలుతో వేగంగా నడుస్తూ 'జల్దీదీజీయే' అంటున్నాడు. అతడు జేబులో చేయి పెట్టాడు. కానీ చిల్లర ఎంతకీ బయటికి తీయడంలేదు.

రైలు వేగం పెరిగింది. టీ కుర్రాడి అరుపులకు చిరునవ్వుతో అతను అలాగే చూస్తున్నాడు.

ఆమె టీ కప్పు ప్లాట్ ఫారం మీది టీ కుర్రాడికి అందివ్వటంతో హడావుడిలో అది జారి ముక్కలయింది. టీకుర్రాడి అరుపులు అతనికి వినోదంగా ఉంది. వాడి మాటలు ఆక్రోశంగా మారాయి. ప్లాట్ ఫారం దాటిన రైలునువాడు అందుకో లేడని గ్రహించాక బిగ్గరగానవ్వాడతను. ఆమెకూడా అతనితో శ్రుతికలిపింది.

నాకింక వారి మొహాలు చూడాలన్పించలేదు. అంతఃసౌందర్యం కరువయిన వాళ్ళిద్దరి రూపాలవికృతత్వాన్నీ భరించలేక మొహం తిప్పుకున్నాను.

—చిల్లర భవానీదేవి.